ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023
5
విజయనగరం



అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20, 21 తేదీల్లో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్ 19 జిల్లా బాల బాలికలు జట్లు ఎంపిక గురువారం పూర్తయ్యింది. ఈ సందర్భంగా జిల్లా కబ్బడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, డిఒఇఒ సురేష్ బాబు, అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటాలని కోరారు. ఎంపిక ప్రక్రియలో కబ్బడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి శ్రీనివాసరావు, బొమ్మన రామారావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను

- ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం
- బహిరంగ సభలో చంద్రబాబు
- చింతలపాలెం వద్ద ఘన స్వాగతం
- రోడ్డుషోకు పోటెత్తిన జనం
- పట్టణమంతా పసుపు మయం



బహిరంగ సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

"కొత్తవలసలో 500 ఎకరాలు గిరిజన యూనివర్సిటీకి కేటాయిస్తే దాన్ని మార్చేశారు. నేటికీ ఎక్కడా ప్రారంభించలేదు. కమీషన్లు అడగడం వల్ల పతంజలి సంస్థ కూడా వెనక్కి వెళ్లిపోయింది. తారకరామ పూర్తయి ఉంటే ఆ ప్రాంతం అభివృద్ధి అయ్యేది. రైవాడ రిజర్వాయర్ కాలువలను ఆధునీకరిస్తే ఈప్రాంత భూములకు నీరందుతుంది. తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం."

-బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-శృంగవరపుకోట, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వం శీతకన్ను వేసిందని, తాను చేపట్టిన ప్రాజెక్టులేవీ పూర్తి చేయలేదని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఎస్.కోటలో రోడ్డుషో నిర్వహించారు. విశాఖ జిల్లా నుంచి విజయనగరం జిల్లాలో ప్రవేశించిన చంద్రబాబుకు కొత్తవలస మండలం చింతలపాలెం వద్ద టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నాయకులు గొంపకృష్ణ, సాలూరు ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, ఆ గ్రామ సర్పంచ్ మాకేన సీతారాం పాత్రుడు (నీవన్), పలువురు టిడిపి నాయకులు స్వాగతం పలికారు. శృంగవరపుకోటలో భారీ వర్షం కారణంగా ఆయన పర్యటన ఆలస్యమైనప్పటికీ, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు బారులు తీరారు.

తెలుగు తమ్ముళ్లు జెండాలు, ఫ్లెక్సీలు చేతబూని చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. వారినుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన కొనసాగుతోందని, వైసిపి పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఎస్.కోటలోని సిరి రిసార్ట్‌కు చేరుకున్న బాబు, కొద్దిసేపటి తరువాత అక్కడి నుంచి దేవిబొమ్మ కూడలి వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా చంద్రబాబుకు జనం స్వాగతం పలికారు.

అనంతరం దేవిబొమ్మ కూడలిలో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మంజూరు చేశానని, గోదావరి నీరు వస్తే ప్రతిఎకరాకు నీరు వచ్చేదని, కానీ దాన్ని వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. పెందుర్తినుంచి అరకు వరకు 4లైన్ల రోడ్డు వేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి అయ్యేదని అన్నారు. తాము కట్టిన 7లక్షల 50వేల టిడ్కో ఇళ్ళు కూడా ప్రజలకు అప్పగించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చాక పేటిఎం బ్యాచ్‌ను వదిలిపెట్టేది లేదని అన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాల కోసం జీవో 3 ను తీసుకొస్తే సుప్రీంకోర్టులో కొట్టేసి గిరిజనులకు అన్యాయం చేశారని అన్నారు. గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి పెట్టానని, కానీ నేడు ఉద్యోగాలు లేవని, పంటలకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. ప్రధానంగా బిసిలకు రాజ్యాధికారం కల్పించి రుణం తీర్చుకుంటానని అన్నారు. సంపద సష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానని తెలిపారు. పేదలకు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఈ అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని కోరారు. రాష్ట్రం వదిలిపెట్టి పారిపోయేవరకు తరిమి కొట్టాలని అన్నారు. సభ వేదికపై మాజీఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నాయకులు గొంప కృష్ణ, విశాఖపార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్ ఉన్నారు.



కాన్వాయ్‌పైనుంచి అభివాదం చేస్తున్న చంద్రబాబు



రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు నాయకులు

రెజ్లర్లకు మద్దతుగా రాస్తారోకో

- లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిని అరెస్టు చేయాలి
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడాకారులను లైంగికంగా వేధిస్తున్న రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్ భూషన్ చరణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ, రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలుపుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ ఎం.సౌమ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి రమణమ్మ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ లో గత 25 రోజులుగా మహిళా రెజ్లర్లు తమపై జరిగిన లైంగిక వేధింపులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్నారని, దేశ ప్రతిష్టను పెంచే క్రీడాకారులు తమకు అన్యాయం జరిగిందని ఇన్ని రోజులుగా పోరాడుతుంటే న్యాయం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం తిరిగి క్రీడాకారుల పైనే దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారత దేశంలో సామాన్య మహిళలకే కాదు మహిళా క్రీడాకారులకు కూడా రక్షణ లేకపోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. పోక్సో, నిర్భయ చట్టాలను అమలు చేసి బ్రిజ్ భూషన్‌ను అరెస్ట్ చేసి మహిళా రెస్లర్ల కు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే ఈ ఆందోళనకు ప్రపంచం వ్యాప్తంగా మద్దతు లభిస్తుందని , దేశంలో ఉన్న ప్రజలందరిని ఏకం చేసి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రైతులు, కార్మికులు ,మహిళలు, విద్యార్థులు, యువజనులు ,క్రీడాకారులు వారి పక్షాన రోడ్డు ఎక్కి ఆందోళనలో పాల్గొంటున్నారని , మహిళా రెజ్లర్లకు న్యాయం జరగని యెడల వచ్చే ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం మెడలు వంచక తప్పదని హెచ్చరించారు. భవిష్యత్తులో క్రీడాకారులకు అండగా జరిగే ఆందోళనలకు అందరూ కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్ , పి. రామ్మోహన్, సహాయ కార్యదర్శులు చినబాబు, రవికుమార్ , హర్ష , వెంకీ, లక్ష్మణ్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు తాటి నాయుడు, సతీష్, సిఐటి యు పట్టణ అధ్యక్షులు బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

9,997 మంది వాలంటీర్లకు నగదు పురస్కారాలు

నేడు జిల్లా స్థాయి కార్యక్రమం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు వాలంటీర్లను సేవా పురస్కారాలతో గత రెండేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడా సేవా పురస్కారాలతో సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి విజయవాడలో శుక్రవారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర స్థాయిలో ప్రారంభిస్తుండగా జిల్లా స్థాయిలో కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో జిల్లాకు చెందిన మంత్రి బొత్స సత్యనారాయణ, ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు.

జిల్లాలో 9,997 మంది గ్రామ, వార్డు వాలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడించారు. అత్యున్నతమైన సేవా వజ్ర పురస్కారానికి 36 మంది, సేవారత్నకు 160, సేవామిత్రకు 9801 మంది ఎంపికైనట్లు పేర్కొన్నారు. వజ్ర పురస్కారం కింద ఎంపికైన వారికి రూ.30 వేలు, రత్న పురస్కారానికి రూ.20 వేలు, మిత్ర పురస్కారానికి రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. జిల్లాలో ఈ పురస్కారాల కింద రూ.10.23 కోట్లు వాలంటీర్లకు నగదు మొత్తాలను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామని తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమం పూర్తయిన అనంతరం అన్ని మండలాలు, మున్సిపల్ వార్డుల్లో రోజుకు రెండు సచివాలయాల పరిధిలో పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించి అందజేయనున్నట్టు పేర్కొన్నారు.



వంగర- ఎం.సీతారాంపురం మధ్య అధ్వానంగా ఉన్న రహదారి

అధ్వానంగా రహదారులు

- ప్రయాణికులకు పాట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు అధ్వాన్నంగా తయారయ్యాయి. రహదారులు ఎక్కడికక్కడ రాళ్లు తేలిపోవడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా అరసాడ నుండి నీలయ్య వలసకు వెళ్లే ప్రధాన రహదారి, వంగర మండల కేంద్రం నుండి ఎం సీతారాంపురం వెళ్లే రహదారి, వంగర నుండి శివ్వాం, తలగాం మీదుగా రుషింగి వెళ్లే ఆర్ అండ్ బి రహదారి, బంగారువలస, కొండ చాకరాపల్లి గ్రామాల మధ్య రహదారి, మద్దువలస నుండి జగన్నాధవలస మీదుగా నీలయ్య వలసకు వెళ్లే ప్రధాన రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. ప్రస్తుతం ఇవి గోతులుగా తయారై రాళ్లు తేలడంతో వాహనాలతో ప్రయాణించేవారు ప్రమాదాలకు గురై అనేక ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే చాలు గోతుల్లో నీరు చేరి రోడ్డు కనిపించని పరిస్థితి ఎదురవుతుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఏ అవసరం వచ్చినా ప్రయాణించాలంటే ఎప్పుడు, ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయ పడుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఈ రహదారులను బాగు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మద్దువలస సచివాలయం ముందు రోడ్డుపై ఏర్పడిన గొయ్యి

ఈదురుగాలుల బీభత్సం

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు
- స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి-శృంగవరపుకోట/లక్కవరపుకోట

శృంగవరపుకోట మండలంలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. 30కు పైగా విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. దీంతో పలు గ్రామాలకు విద్యుత్తు సరఫరా స్తంభించింది. విశాఖ-అరకు రహదారిలో చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

గురువారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ఇదే సమయంలో పెద్దఎత్తున ఈదురుగాలులు వీయడంతో విశాఖ-అరకు ప్రధాన రహదారిపై ఉన్న వృక్షాలు నేలకొరిగాయి. మండలంలోని వివిధ ప్రాంతాల్లో 30కు పైగా విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి, విద్యుత్తు వ్యవస్థ అతలాకుతలమైంది. మామిడి పంటకు నష్టం వాటిల్లింది. ప్రధానరహదారిపై చెట్లు, స్తంభాలు పడిపోవడంతో గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహన చోదకులు, స్థానిక యువత స్పందించి రోడ్డుపై పడిన చెట్లను తొలగించి, విద్యుత్తు స్తంభాలను పక్కకు జరపడంతో వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగించాయి. విద్యుత్తు వ్యవస్థ దెబ్బతినడంతో ఎఇ రుద్ర రవికుమార్ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన విద్యుత్తు పనులు ప్రారంభించారు. శృంగవరపుకోట పట్టణంలో చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులు ఈదురుగాలులతో నేలకొరిగాయి. దీంతో పట్టణంలోని ట్రాఫిక్‌జామ్ అయింది.



నిలిచిన వాహనాలు



రోడ్డుపై పడిన విద్యుత్తు స్తంభం తొలగిస్తున్న యువకులు

పిడుగుపాటుకు 17 మేకలు మృతి

శృంగవరపుకోట మండలంలోని బొడ్డవర పంచాయతీ మరుపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం మేకల మందపై పిడుగు పడింది. దీంతో చెట్టు కింద ఉన్న 17 మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన వ్యాపార సత్తిబాబు వాతావరణం చల్లబడంతో చెట్టు కింద మేకలను ఉంచాడు. ఈ సమయంలో మేకలపై ఒక్కసారిగా పిడుగు పడంతో అన్నీ చనిపోయాయి. ఇది చూసిన సత్తిబాబుతో పాటు అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపించారు. రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తమ జీవనోపాధి పోయిందని బాధితులు బోరున విలపించారు. బొడ్డవర సర్పంచ్ దేవాపూర్ మేన, వైసిపి నాయకులు బుద్ధరాజు మురళిరాజు గ్రామానికి చేరుకుని రైతు కుటుంబాన్ని పరామర్శించారు ప్రభుత్వపరంగా సాయం అందించేలా చూస్తామని హామీనిచ్చారు.



మృతిచెందిన మేకలు

రెయిన్‌బోతో సెంచూరియన్ ఒప్పందం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రెయిన్‌బోతో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం రెయిన్‌బో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదేళ్ల గిరితో వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీనరసింహచార్యులు, విభాగాధిపతులు నూకరాజు, రషీద్, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్, ఉన్నతాధికారులు

తప్పుల్లేని ఓటర్ల జాబితా

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఓటర్ల జాబితాలోని మార్పులు చేర్పులను బిఎల్‌ఓ ఆధ్వర్యం లో తనిఖీ చేసి తప్పులు లేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సూచించారు. క్లెయిమ్స్ , అభ్యంతరాలను వ్యక్తిగతంగా పరిశీలించి క్లోజ్ చేయాలని అన్నారు. మండలాల వారీగా ఓటర్ల జాబితాలను విశ్లేషించుకొని జనాభా నిష్పత్తి కి తగ్గట్టుగా జస్టిఫికేషన్ ఉండేలా చూడాలన్నారు. ఇప్పట్నుంచే ఈ ప్రక్రియ ప్రారంభించాలని అన్నారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జిల్లా ఎనికల సరళి పై రూపొందించిన ఎస్ఒపి (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) ను పిపిటి ద్వారా వివరించారు. ఓటర్ల జాబితా సవరణపై, ఇవిఎం గోడౌన్ స్టేటస్ , ఎపిక్ కార్డుల పంపిణీ , పోలింగ్ స్టేషన్ల నిర్వహణ, సిబ్బంది నియామకం, రాండమైజేషన్, శిక్షణ, డాటా అప్లోడ్ చేయడం తదితర ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అన్ని అంశాలపై సమగ్రంగా ఎస్ఒపిని తయారు చేసి వివరించారు. అనంతరం కలెక్టర్ నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు జరీ చేసారు. వీడియో కాన్ఫరెన్స్ లో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ గణపతి, ఆర్‌డిఒ సూర్యకళ, ఉప కలెక్టర్‌లు పద్మలత, సూర్య నారాయణ, శేష శైలజ, నూక రాజు, తదితరులు పాల్గొన్నారు.



మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

తీరంలో తారెక్కిస్తున్న ఎండలకు ఉపాధి పనిలో కూలీలు మండిపోతున్నారు. పని చేసే చోట నిలువ నీడలేకపోవడంతో భగ భగ మండే సూర్యుడు తాపానికి దొరికి పోతున్నారు. పనిలో దాహం తీర్చేందుకు కనీసం తాగునీరు లేక ఎండ వేడిమికి విలవిల లాడిపోతున్నారు. మండు వేసవిలో కూడా రెండు పూటలా పనిచేయాలని అధికారులు ఆదేశించడంతో ఆవేదన చెందుతున్నారు. అయినా శ్రమకు తగ్గా ఫలితం దక్కడం లేదన్న కూలీలు అంటున్నారు.

ఎండల్లో మాడుతున్న ఉపాధి కూలీలు

- 40 డిగ్రీలపైనే నమోదవుతున్న ఎండలు
- తాగునీరు, టెంట్లు లేక అవస్థలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగ మండలంలోని 28 పంచాయతీల్లో 17,600 మంది కూలీలకు ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. రోజుకు 11500 మంది కూలీలు పని చేస్తున్నారు. అయితే వీరంతా పనిచేసిన ప్రదేశంలో మండలంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకు విలవిల లాడుతున్నారు. రెండు పూటలా పనిచేయాల్సిందేనని అధికార్లులు ఆదేశాలు జారీ చేయడంతో ఎండ బారిన పడాల్సి పరిస్థితి నెలకొంది. పనిచేసే ప్రదేశంలో కనీసం నీడ కోసం టెంట్లు గాని, తాగునీరు గాని లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పనిలో ఎవరికైనా ఆపద కలిగితే ప్రథమ చికిత్స బాక్సులు కూడా లేకపోవడం దారుణం. గతంలో వేసవిలో పనిచేసిన కూలీలకు మజ్జిగ పంపిణీ చేసేవారు. కనీసం ఇప్పుడు తాగునీరు కూడా ఏర్పాటు చేయడంలేదు.గతంలో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వేసవి అలవెన్స్ 30 శాతం అదనంగా ఇచ్చేవారు. దాంతో పాటు గునపాం, పారతో తవ్వేవారికి అదనంగా అలవెన్స్ ఇచ్చేవారు. మజ్జిగ కోసం రూ.5, తాగునీటి కోసం రూ.5 చొప్పున ఇచ్చేవారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తూ వీటన్నింటినీ ఎత్తివేసింది. రెండుపూటలా పని పెట్టి కూలీలకు ఇబ్బందులకు గురిచేస్తోంది. మరోవైపు గిట్టుబాటు కూలి రాకుండా చేస్తోంది. దీంతో కూలీలు లబోదిబో మంటున్నారు. ఎండల వల్ల ఒక్కపూట పని పెట్టేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొత్తగా వచ్చిన ఎన్ఐసి సర్వర్ కూలీల పాలిట శాపంగా మరింది.

పని దినాలు పెంచాలి



పూట గడవక ఎంత వేడి మండుతున్నా పనికి వస్తున్నాం. అయితే ఒక్కో కుటుంబానికి 100 రోజుల పని ఇవ్వడం వల్ల రెండు నెలలు వస్తే పనిదినాలు పూర్తి అయిపోతున్నాయి. దాంతో కూలీలంతా ఇబ్బందులు పడుతున్నారు. పని దినాలు 150 చేయాలని కోరుతున్నాం.

- ఊడుకల విజయ , మేట్

నీడలేక విలవిల్లాడుతున్నాం



మండే ఎండలో నీడలేక విలవిల లాడుతున్నాం. గతంలో మజ్జిగ, నీరు, టెంట్లు ఇచ్చేవారు. ఇప్పుడు మజ్జిగ కాదు కదా నీరు కూడా ఇవ్వరట. టెంట్లు కూడా ఇవ్వలేదు. ఎండలోనే ఇబ్బంది పడుతున్నాం. వడదెబ్బకు గురవుతామేమోనని ఆందోళన చెందుతున్నాం. పని చేస్తున్న ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలి. తాగునీరు అందించాలి. **– పాండ్రింకి అసిరయ్య, ఉపాధి కూలీ**

ఒక్క పూటే పని పెట్టాలి



వేసవిని దృష్టిలో పెట్టుకొని ఒక్క పూట మాత్రమే పని పెట్టాలి. రెండు పూటలా పనివల్ల తీవ్రంగా ఎండకు దొరికి పోతున్నాం. వయసు మల్లినవారు, స్త్రీలు ఎండబారిన పడుతున్నారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స కిట్లు కూడా లేవు. అధికారులు స్పదించి ఒక్క పూట పని పెట్టేలా చర్యలు తీసుకోవాలి. **- పచ్చిపాల సంతోష్, ఉపాధి కూలీ**

వేసవి దృష్ట్యా రెండుపూటలా పని

ఎన్ఐసి సాఫ్ వేర్ ప్రకారం రెండు పూటలా పని ఫొటో అప్‌లోడ్ చేయాలి. అందుకే రెండు పూటలా పని పెడుతున్నాం. ఒక్క పూట అయితే మధ్యాహ్నం 1 గంట వరకూ చేయాలి. వేడిని తట్టుకోలేరు. అందుకే వేసవిని దృష్టిలో పెట్టుకొని రెండు పూటలా పని పెడుతున్నాం. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలని ఫీల్డు అసిస్టెంట్‌లకు చెబుతున్నాం. ఇప్పటికే చాలా మంది కర్రలతో పందిరిలు వేసుకున్నారు. రోజుకు ఒక్కొక్కరికి సరాసరి రూ. 230 వరకూ కూలి వస్తుంది. గతంలో ఇచ్చే అలవెన్స్‌లు ఇప్పుడు లేవు.

–జి.కనకరాజు, ఎపిఒ, పూసపాటిరేగ మండలం



లేగదూడల ప్రదర్శనను ప్రారంభిస్తున్న దామోదరరావు

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బల్లంకి గ్రామంలో పశువైద్యాధికారి బి.సింహాచలంనాయుడు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన ఆకట్టుకుంది. 60 లేగదూడలను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. వీటిలో విజేతలుగా నిలిచిన వాటి యజమానులకు బహుమతులను అందజేశారు. జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.దామోదరరావు, పశుసంవర్ధక శాఖ ఎడి బి.చలపతిరావు, ఉప సర్పంచ్ పల్లి ధనుంజయ్, గ్రామ నాయకులు బొడ్డు శ్రీను, పంచాయతీ కార్యదర్శి మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు వాలంటీర్లకు సేవారత్న బిరుదు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ప్రజలకు ఉత్తమ సేవలు అందించడంలో చురుకైన పాత్ర పోషిస్తున్న వాలంటీర్లను మండలానికి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి సేవారత్న బిరుదును ప్రభుత్వం అందజేస్తున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ, గొల్జాం పంచాయతీ సర్పంచ్ తూర్పాటి సంతోషమ్మ తెలిపారు. గురువారం మీడియాతో వారు మాట్లాడుతూ మండలంలో గొల్జాం పంచాయతీకి చెందిన జామి హరిఅప్పారావు, ధనలక్ష్మి (కొట్యాడ), బి.రమేష్ (ఎల్.కోట), ఎస్.రాము (బీమాలి), జె.కృష్ణ (ఎల్.కోట సీతారాంపురం) సేవా రత్న బిరుదుకు ఎంపికైనట్లు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.20 వేలు ప్రోత్సాహక నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. తమ పంచాయతీ పరిధిలో మరో 14 మందిని సేవామిత్రలుగా ఎంపిక చేసిన ఒక్కొక్కరికి రూ 10 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆ విద్యాసంస్థలను సీజ్ చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పాఠ్యపుస్తకాలు విక్రయిస్తూ విద్యా వ్యాపారం చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు విద్యాసంస్థలను తనిఖీ చేసి అనుమతులు లేని భవనాలను సీజ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవి కుమార్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం డిపిఎం ఆనందరావు తెలిపారు. గురువారం నవధాన్యాల కిట్లను ఎఒ రవీంద్ర ఆధ్వర్యాన ఆర్‌బికెలకు పంపిణీ చేశారు. 20 నుంచి 30 రకాల విత్తనాలను సేకరించి, 10 కిలోల చొప్పున నవధాన్యాల కిట్లుగా తయారు చేసి, పంపిణీ చేశారు. 10 కిలోల కిట్‌ను రైతులకు రూ.650కు అందించనున్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎస్.నాగమణి, ఈశ్వరమ్మ, సింహాచలం, ఐసిఆర్‌పి నాని పాల్గొన్నారు.

ఆంధ్ర అంబేద్కర్ పివి రావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మాలల రిజర్వేషన్ల కోసం నిరంతరం పోరాడి వారి హక్కులను కాపాడిన ఆంధ్ర అంబేద్కర్ స్వర్గీయ పి.వి రావు అని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామకృష్ణ అన్నారు. గురువారం ఉదయం స్థానిక రామతీర్థం జంక్షన్ వద్ద ఎస్‌సి కాలనీలో లోగిశ రామారావు ఇంటి వద్ద జరిగిన పి.వి రావు 74వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. పి.వి రావు అమర్ రహే అని, పి.వి రావు ఆశయాలు సాధిస్తామని, మాలల ఐక్యత వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి రామకృష్ణ, జిల్లా మహిళా నాయకురాలు చోళ్ల రాజకుమారి, నెల్లిమర్ల మండల మాల మహానాడు అధ్యక్షులు అలుగోలు ఆనంద్, కార్యదర్శి చోల్ల సింహాచలం, ఉపాధ్యక్షులు ఉప్పాడ పైడితల్లి, కార్యదర్శులు టొంపల సీతారాం, దుప్పాడ అప్పన్న పాల్గొన్నారు.

క్రీడాకారులకు గుడ్లు, పాలు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో 80 మంది క్రీడాకారులకు ఉప్పల రాజేష్, రేపాక సురేంద్ర, కాపుగంటి పవన్, డాక్టర్ శ్రీనివాసరావు నెల రోజులపాటు పాలు, గుడ్లు సరఫరా చేస్తున్నారు. గురువారం దాతలు శిక్షణ శిబిరాన్ని సందర్శించి, క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం క్రీడాకారులకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాపుగంటి సతీష్, విశ్రాంత జవాను వెంకట్రావు, పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు, కోచ్‌లు బి.హారిక, పి.మౌనిక, యోగా కోచ్ కళ్యాణి పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి - వంగర



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అరసాడ సచివాలయాన్ని ఆయన పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులు, గృహ నిర్మాణాలు సంబంధించి సచివాలయ ఉద్యోగులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి రూరల్

నాలుగేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. గురువారం మండలంలోని పారాది గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి తెలియజేసే బుక్ లెట్లు పంపిణీ చేశారు. ప్రతీ గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని వయసుతో పనిలేకుండా ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి నాలుగేళ్ల పాలనలో ఇచ్చిన హామీలను 98శాతం నెరవేర్చారని తెలిపారు. గ్రామంలో తమ దృష్టికి వచ్చిన పలు సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. గ్రామంలో అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. ఎవరైనా సమస్యంటూ వస్తే వారితో మాట్లాడి తెలుసుకొని వాటిని పరిష్కరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి శంబంగి లక్ష్మి, జెడ్‌పిటిసి ఎస్.శాంతకుమారి, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాల నాయుడు, ఎంపిడిఒ అల్లు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంబంగికి దంత చికిత్స చేస్తున్న వైద్యులు


సిహెచ్‌సిలో ఎమ్మెల్యేకు చికిత్స

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్యక కేంద్రంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం దంత వైద్యం చేయించుకున్నారు. ఎమ్మెల్యే శంబంగికి దంతాలు నొప్పి రావడంతో సిహెచ్‌సిలో దంత వైద్య విభాగానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చాగంటిని కలిసిన ఎమ్మెల్యే శంబంగి

ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు గురువారం టిబిఆర్ కన్వెన్షన్ హాల్లో మర్యాద పూర్వకంగా కలిశారు. చాగంటిని సన్మానించారు. ఆయనతో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి- డెంకాడ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని డి.తాళ్లవలస గ్రామంలో గురువారం రాత్రి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు మరోసారి దరఖాస్తు చేసుకుంటే పథకాలు వస్తాయన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, ఎపిఎం విజయలక్ష్మి, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్తు కోతలు నివారించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేళాపాలా లేకుండా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అప్రకటిత విద్యుత్ కోతలు విధించడం వల్ల వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎటువంటి ముందస్తు సమచారం లేకుండా అధికార్లు సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు విద్యుత్ కోతలు విధించడం భావ్యం కాదన్నారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరిగి వడగాల్పులు వీచి వృద్ధులు, చిన్న పిల్లలు అనారోగ్యం పాలవుతున్నా అవేమి పట్టించుకోకుండా విద్యుత్ కోతలు అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాగా ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతన దార్లకు పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించడంలో అధికార్లు విఫలమయ్యారని విమర్శించారు. వేసవి వడ గాల్పులు ఎక్కువగా ఉండడంతో వేతనదార్లు మృతి చెందుతున్నారని ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బొబ్బిలి : విద్యుత్తు కోతలను నివారించాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు. స్వామివారివీధిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేపడుతున్న చోట ఆయన మాట్లాడారు. పట్టణంలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు పాడైపోవడంతో నాణ్యమైన విద్యుత్తు అందడం లేదన్నారు. అనధికార విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్తు కోతల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఇంగ్లీష్ నేర్చుకుంటే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఇంగ్లీష్ నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయులు పనుమర్తి సన్యాసిరావు అన్నారు. గురజాడ స్మారక జిల్లా కేంద్రం గ్రంథాలయంలో జరుగుతున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం ఆయన విద్యార్థులకు ఇంగ్లీషులో మాట్లాడడం నేర్పించారు. అనంతరం విద్యార్థులకు నాటకం అంటే ఏమిటి, నాటకంలో ఏ విధంగా ముఖ కవళికలు, హావభావాలు ప్రదర్శించాలో తెలిపారు. తదనంతరం విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస ఎస్‌సి కాలనీలో మంచినీటి కుళాయిని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఇ.పైడిరాజు గురువారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎస్‌సి కాలనీ వాసులు జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్ఎల్ఎ, మండల నాయకులును మంచినీటి సమస్య తీవ్రంగా ఉన్నందున కుళాయి వేయించాలని కోరారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని జెడ్‌పి చైర్మన్ ఆదేశించడంతో కుళాయి ఏర్పాటు చేశారు.

అంగన్వాడీ కార్యకర్తకు సన్మానం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆకులసీతంపేటలో ఉద్యోగ విరమణ చేసిన అంగన్వాడీ కార్యకర్త కుప్పిలి రాజ్యలక్ష్మిని గురువారం గ్రామ సచివాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వీణేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిడి శ్రీనివాసరావు

పండ్ల తోటల పెంపకానికి
చిన్న, సన్నకారు రైతులు అర్హులు

ప్రజాశక్తి- రేగిడి

పండ్ల తోటలు పెంపకానికి చిన్న, సన్నకారు రైతులు అర్హులని ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మీసాల శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఉపాధి హామీ పథకం కార్యాలయంలో క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేయాలన్నారు. విస్తృతంగా పండ్ల తోటలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పండ్ల తోటల వల్ల రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చునన్నారు. జాబు కార్డు ఉన్న వారందరికీ గ్రామాల్లో పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకులు ఉదయం, సాయంత్రం పనులు మస్టర్లకు సంబంధించి ఫోటోలు ఎంఎంఎస్ యాప్ ద్వారా వేతనదారులు వివరాలు నమోదు చేయాలని సూచించారు. పండ్ల తోటలకు సంబంధించి ఇప్పటి వరకు మండలంలో 20ఎకరాలు గుర్తించినట్లు ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ తెలిపారు. హౌసింగ్‌లో 90 డేస్ సంబంధించి పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇసి రామినాయుడు, సాంకేతి సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

పనిచేయని వాలంటీర్లను తొలగించండి

మున్సిపల్ చైర్మన్ సావు మురళి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో పని చేయని వాలంటీర్లను తొలగించాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ.. సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా పని చేయని వాలంటీర్లను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని సూచించారు. స్పందనకు వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సావు మురళి

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట



రక్తదానం చేస్తున్న రోటరీ ప్రతినిధులు

రక్తదానం ప్రాముఖ్యతను గుర్తించి యువత స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని రోటరీ పాస్ట్ గవర్నర్ ఆర్కే జైన్ విజ్ఞప్తి చేశారు. గురువారం రోటరీ రక్త నిధి కేంద్రం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రోటరీ ప్రతినిధులు పాల్గొని 45 యూనిట్ల రక్తాన్ని పార్వతి దేవి అంచాలియ రోటరీ రక్త నిధి కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ పూర్వపు గవర్నర్ ఆర్.కె. జైన్ మాట్లాడుతూ రోటరీ బ్లడ్ బ్యాంకు విజయనగరం లో ఏర్పాటు చేయడం ద్వారా వందలాది మంది రోగులకు ఉచితంగా రక్తం సకాలంలో అందించి వారి ప్రాణాలను కాపాడామని తెలిపారు. రక్తదానానికి ముందుకు వస్తున్న యువతకు అభినందనలు తెలిపారు.రోటరీ బ్లడ్ బ్యాంకు నిర్వహణకు సహకారం అందిస్తున్న పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షురాలు ఉమా బాలాజీ, కార్యదర్శి బి.సూర్యలక్ష్మి, మండా రవి, నారాయణ మూర్తి, రాధికారాణి, కాపుగంటి రవి, మాటూరు మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్య విద్యాసంస్థలకు రోటరీ బ్లడ్ బ్యాంక్ వారి ప్రత్యేక ప్రశంస

సీతం ఇంజనీరింగ్ కళాశాల, తోట పాలెంలో గల సత్య డిగ్రీ కళాశాల రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో గతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు సత్య డిగ్రీ కళాశాలకు,సీతం కళాశాలకు ప్రత్యేక ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను రోటరీ బ్లడ్ బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్‌కెజైన్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రెసిడెంట్ డి.బాలాజీ, సెక్రటరీ రవి, ట్రెజరర్ ప్రవీణ్ కుమార్, సీతం కళాశాల సిఎస్ఒ కె సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఎన్.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE VIZIANAGARAM
S.O.P. 5/2023

Between:
Routhu Neelima@ Neelam Rani, S/o late Venkata Satyanarayana, D.No.10-10-15, Near Mutyalamma Temple, Kummriveedhi, Kothapeta, Vizianagaram. ....Petitioner
And:
1) R.Jyotheswari @ Jyothi, Calling as wife of Routhu Venkata Satyanarayana, D/o Ch. Appala Naidu, R/o H.No.8-31-137, Thotapalem, Vizianagaram.
2) The Deputy Director, District Survey Lands and Records Dept. Collector Complex, Vizianagaram. ....Respondents

NOTICE

ఇందలి పిటిషనరు రౌతు లేటు వెంకట సత్యనారాయణ వారసులుగా Succession Certificate జారీ చేయమని కోరుచూ పిటిషన్ కోర్టులో దాఖలు చేసినారు. ఇందలి రెస్పాండెంట్లు కాక ఎవరైనా ఆక్షేపణదారులుంటే పై కోర్టు ఎదుట **తే 21-6-2023దీ ఉదయం 10-30 గంటల**కు స్వయంగా గాని, లాయరు ద్వారాగాని హాజరై మీ వద్దఉన్న పత్రాలను దాఖలు చేయవలెను. లేనిచో వున్న ఆధారాల మేరకు పరోక్షంగాను శ్రీ కోర్టువారు తీర్పు చెప్పబడును అని తెలియజేయడమైనది.

బై కోర్టు ఆర్డరు

P.Dhananjaya Rao
Y.Hari Krishna
Advocate, Vizianagaram
Cell: 9440711430

In the Honourable Court of the Senior Civil Judge Vizianagaram
OS 45/2022

Between:
శ్రీమతి పోకశెట్టి రాజేశ్వరి ....వాది
And:
శ్రీమతి కోట్ల భగవతి మరియు ఇతరులు ..ప్రతివాదులు

To
ప్రతివాది నెం:-3
శ్రీమతి కోట్ల సుజాత W/o Murali, D/o Late, Krishnanrao, జమ్ము గ్రామం, విజయనగరం మండలం & జిల్లా.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా ఇందలి వాది ప్రతివాదులపై విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టునందు OS 45/2022 దావా వేసియున్నారు. ఇందలి 3వ ప్రతివాదినకు పలుమార్లు నోటీసులు పంపినప్పటికి తీసుకొనకపోవడంవలన శ్రీ కోర్టువారు పత్రిక ప్రకటన ద్వారా నోటీసు జారీ చేసి తే **15-06-2023**ది వాయిదా వేసి ఉన్నారు. కావున ఇందలి 3వ ప్రతివాది ప్రత్యక్షముగా గాని, మీ తరపు న్యాయవాది ద్వారాగాని **తే 15-06-2023 ఉదయం గం॥ 10-30ని॥**లకు పై కోర్టునందు హాజరై ఆక్షేపణలు ఉన్నఎడల దాఖలు చేయవలెను. లేనిచో మీపై పరోక్షముగా వ్యాజ్యము విచారణ జరిపి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు ప్రకారము)

బి.రమేష్
వాదితరపు న్యాయవాది
RMS కాలనీ, విజయనగరం
సెల్ : 9440540288

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కెఎల్‌పురంలో గురువారం ఉదయం విద్యుత్ స్తంభం ఎక్కిన టెక్కలి బుజ్జి (30) అనే వ్యక్తి విద్యుత్తు షాక్‌తో మృతి చెందాడు. టెక్కలి మేరీబాబు ఇంటికి కరెంట్ లేకపోవడంతో సర్వీసు వైర్‌ను సరిచేసేందుకు వారి కుటుంబ సభ్యుడైన బుజ్జి విద్యుత్ శాఖ సిబ్బంది అనుమతి లేకుండా స్తంభం ఎక్కాడు. మేరీ బాబు ఇంటి లైన్ వైపు ట్రాన్స్ఫార్మర్ ఎస్ ఎస్ 1కు బదులు, ఎస్ ఎస్ 321 ట్రాన్స్‌ఫార్మర్ ఓపెన్ చేయడం తో విద్యుత్ స్తంభం మీద ఉన్న బుజ్జి షాక్‌కు గురయ్యాడు. దీంతో షాక్‌కు గురైన అతడ్ని జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

అనుమతి లేకుండా స్తంభాలు ఎక్కితే క్రిమినల్ చర్యలు : ఎస్ఇ

విద్యుత్ శాఖ అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులు విద్యుత్ స్థంబాలు ఎక్కితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఎస్ఇ పి.నాగేశ్వరరావు తెలిపారు. దయచేసి ప్రజలు ఎటువంటి విద్యుత్ సమస్యలు వచ్చినా విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1912కు ఫోన్ చేయాలని కోరారు. అనుమతి లేకుండా విద్యుత్ స్థంబాలు ఎక్కి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం రైల్వే స్టేషన్ యార్డ్ సమీపంలోని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు జిఆర్‌పి ఎస్ఐ రవి వర్మ తెలిపారు. మృతుడిపై ఎటువంటి గాయాలు గాని, దెబ్బలు గాని లేవని, వడదెబ్బ లేక అనారోగ్యం వల్ల చనిపోయి ఉండవచ్చునని చెప్పారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని దాసుళ్లపాలెం పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...

మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన గోకాడ నాయుడుతో మహేశ్వరి (30) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. గురువారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లిన దాసుళ్లపాలెం గ్రామ కూలీలకు పొదల్లో మహిళ మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే విజయనగరం డిఎస్‌పి గోవిందరావు, సిఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ ఎం.ముకుందరావు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతురాలి ఫొటోలను మహిళా పోలీసుల ద్వారా వాట్సాప్ గ్రూపుల్లో పంపించారు. బంధువుల ద్వారా మృతురాలు గోకాడ మహేశ్వరిగా గుర్తించారు. పోలీసులు వెంటనే డాగ్‌స్క్వాడ్‌ని తెప్పించారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. మహేశ్వరి బుధవారం ఉదయం విజయనగరం మహిళా మండలి సమావేశానికి బయల్దేరి వెళ్లినట్లు బంధువులు చెబుతున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి పద్మశాలివీధికి చెందిన కొండేటి సంతోషి (32) గురువారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంతోషి భర్త వరకట్న వేధింపులకు గురిచేయడంతోపాటు కొన్ని రోజులుగా తన భర్త వ్యవహారం బాగోలేదని, అత్తింటి వారిని అడిగినా పట్టించుకోలేదని మనస్తాపానికి గురై ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ పి.నారాయణ రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.